కథానిక :

# అరణ్యంలో మానవయంత్రం

శ్రీ మునిపల్లెరాజు

## 1

బంగారయ్య కోయపల్లె జేరి వరదలనాటికి రెండేళ్ళు దాటింది. అసలు బంగారయ్య కోయపాలెం జేరటమే పెద్దకథ.

ఖమ్మంమెట్టులో ఎరువుల వ్యాపారం జేయబోయి బురదలో కాలుబెట్టాడు. కులంవాళ్ళంతా బంగారయ్యను చీవాట్లు పెట్టారు. వాళ్ల మామ వచ్చి "అరే, బంగారూ, మన కులంలో లేని యాపారా లేనికిరా? నాకు డెలియ కడుగుతాను! పెపంచకం గొడ్డోయిందంటరా—ఎరువులు ఎరువులని పరుగులు దీస్తివి. ఆటి మంచీ, చెబ్బరా డెల్సిన గటం అయితే మల్లీ ఆటి జోలికి బోడ్రా" అని అందరిముందూ అల్లుణ్ణి కూకలేశాడు.

బంగారయ్యకు ఎరువుల వ్యాపారం జెయ్యమని జెప్పింది వాళ్ల పినబాబు రాగవయ్య. (అప్పటికి ఎరువుల ధరలకు కంట్రోలు వుందిలేండి.) రాగవయ్య ముఖం తప్పించితప్పించి ఒకరోజున తప్పనిసరిగా—ఎదురైనప్పుడు కొన్ని హితవాక్యాలు పలికాడు—"అదేందిరా, బంగారం! తేమాసివాళ్లందరూ ఆరు మొగ్గలు దొడిగి, మూడు పువ్వులేసి మెరిసిపోతుంటే నువ్విట్టా జేశావేందిరా బంగారం? ఒరే, ఆ అంగ్రేజి లెక్కలు మనకు అబ్బవురా. అచ్చిరాంది బంగారం బట్టినా మట్టవుద్దిరా. ఉప్పు, మిరపకాయ అమ్ముకునేవాళ్లం. కంట్రోలు లెక్కలకి, ఇంకంటేక్సులకు అతకలేమురా అంటే యిన్నావంటరా—పెడసరం? ఇప్పుడు పదిమందిలో నాకు తలబోయిందంటావా, నీకు బోయిందంటావా?"

ఆకులు మడ్చుకొని చేతులు గాల్చుకొన్న బంగారయ్య పినబాబు వంకజూసి నోరెత్తబోయినాడు; అతను అప్పు సంగతి హెచ్చరించకముందే, రాగవయ్య వీధిమలుపు దిరిగి మాయమైపోయినాడు.

ఉన్నవూళ్లో బంగారయ్యకు అప్పుపుట్టలేదు. పిల్లనిచ్చిన మామగూడా పెదిమ విరిచాడు. బంగారయ్య కాలిబురద ఎవ్వరూ కడగలేదు.

ఇక రొండోకంటికి తెలియకుండా రాజమండ్రిలో ఆదెమ్మ నానుతాడు తాకట్టుబెట్టి—బస్తా వుప్పు, అరబస్తా పప్పు, డజను అగ్గిపెట్టెలు (కొత్తరకం ఒంటెమార్కు), మూడువీశెలు లంకపొగాకు, బుట్టబెల్లం (అనకాపల్లి ముక్కలు), (బొడ్లో ఆరు రూపాయల చిల్లర వేసుకొని) పడవలో వేసి, గోదావరి దాటి బంగారయ్య కోయపాలెం జేరాడు. అడవి రెల్లుగోసి కోయదొరలు పాలెం మధ్యలో బంగారయ్యకు యిల్లు గట్టారు. ఇంటి పంచెపాళీలో ఆ పాలేనికి మొట్టమొదటిసారిగా దుకాణం వెలిసింది.

బంగారయ్య కోయపాలెంజేరి వరదలనాటికి రెండేళ్ళు దాటింది.

* * * *

బంగారయ్య ఈ రెండేళ్ళుగా ఎవ్వరికీ వుత్తరం రాయలేదు. జ్ఞాతులందరూ పీడా వదిలిపోయిందని అతనిమీద పుకార్లు పుట్టించారు. "మన్యంలో చలిజ్వొరం వొచ్చి చచ్చిపోయాడండీ" అని అతని పాతబాకీదార్లకు గుర్నాధం పని గల్పించుకొని చెప్పాడు. "కోయాళ్లు తలగొట్టి మొలేశారు గదండీ. ఆడి బుద్ధి మంచవుతేనా, కోయాళ్ళయినా, కోనంగాళ్ళయిగా ఆదరించేందుకు. అయ్యా, నోరు మంచయితే వూరు మంచండి. వట్టి ఆశపోతుమడిశండీ" అని కర్ణంగారితో ఆకుల సినపుల్లయ్య మనవి చేసుకొన్నాడు. అన్నీ గాలి కబుర్లు.

కోయపల్లె జేరింతర్వాత బంగారయ్య గడ్డిబొద్దు అయినాడు. ఆదెమ్మకు మన్యం నీళ్ళు పడి మూర్ఛలు పోయినాయి. పెద్దాడు వెంకటరత్నం కాలికీ చేతికీ అక్కరకు వచ్చాడు.

బంగారయ్య కొట్లో కూచొంటాడు. ఆదెమ్మ పొయ్యిదగ్గర వడలు పకోడీలు వండుతుంది—వుల్లిపాయ లేసి. పెద్దాడు వెంకట్రత్నం అడవిలో గుల్ల చింతకాయలు కొట్టించి, గింజ దీయించి అందరికన్నా అణా తక్కువ జేసుకొని, చింతపండు బస్తాలు

పోలవరంమీదుగా రాజమండ్రికి పడవలో వేస్తాడు. అందువల్లనే బంగారయ్య గడ్డి బొద్దయినాడు. యెంకట్రత్నానికి బట్టతల వచ్చింది. ఆదెమ్మకు మెళ్ళో పాతనాన్తాడుకు తోడు, గట్టి కంటె, కాసులదండ అమరినవి. పచ్చి పులుచు గుర్నాథం, ఆకుల సినపుల్లయ్య ఎంత చంకలు గొట్టుకున్నా బంగారయ్యకు చలి జ్వరం వచ్చి చచ్చిపోలేదు; కోయవాళ్ళు తలగొట్టి మొలెయ్యనూ లేదు.

బంగారయ్య కొట్టువెలిసింతర్వాత కోయదొరలు వుప్పుకూ, పప్పుకూ గోదావరిదాటి పోలవరం పోవాల్సిన అవసరం తప్పింది. వర్షాలు దబాటుగా కురిసినప్పుడు సుబులుగా, దిగులుగా వత్తిగిలకుండా బంగారయ్య లంక పొగాకు లభిస్తున్నది. మల్లుదొర చిన్నకొడుకు పెళ్ళికి అరవైరూపాయలు బాకీగూడా యిచ్చాడు బంగారయ్య. పోలుమల్లు అడివిగొట్టి చదరంజేసుకొన్న కొత్తమడిలో జల్లే విత్తనాలకు వేలుముద్దర వేయించుకొని అప్పుగూడా యిచ్చాడు. అయితే పెళ్ళిజేసుకొన్న మల్లుదొర చిన్నకొడుకు, విత్తనాలుజల్లిన పోలుమల్లు వచ్చే యేడాదంతా అడవిలో వాళ్ళు గొట్టిన చింతపండు బంగారయ్యకే తోలుతామన్నారు, అదునులో అడ్డుపడ్డందుకు. అప్పుడు బంగారయ్య తనకు పోటీగా చింతపండు కొంటున్న పాత రాజమండ్రి వ్యాపారి యెన్నపూస గురవయ్యవంక జూశాడు. యెన్నపూస గురవయ్య పడవదిగి కోయపల్లెకు మళ్ళీ తిరిగి రాలేదు. ఇప్పుడు యెంకట్రత్నం (పెద్దాడు) అందరికన్నా బేడ ఎక్కువజేసుకొని పోలవరం మీదగా పట్నానికి చింతపండు ఎగుమతి చేస్తున్నాడు. బంగారయ్య రొండు గడ్డిబొద్దులయినాడు.

## 2

భద్రాచలం యాత్ర జేసుకొని తిరిగిపోతూ కోయపాలేనికి బాలహరిదాసు వచ్చాడు. బాల హరిదాసంటే బాలకుడనిగాదు. "నాపేరే బాలదాసు" అని హరిదాసన్నాడు. కోయదొరలంతా తలకాయలు జేర్చి కథ జెప్పించాల్సిందేనని తేల్చారు.

"ఎందుకొచ్చిన యాసాలు జెప్పండి యీ కరువుకాలంలో, కూటికొచ్చునా? గుడ్డకొచ్చేనా మల్లుదొరా?" అని బంగారయ్య అన్నాడు.

ఆ మాటలకు ఆదెమ్మకు బాగా కోపంవచ్చింది. "ఇక బలే మడిసివేలే. రామా కృష్ణా అనుకోకుండా యింకెందుకంట గటాలు? ఏం యేలియ్యాలా, లచ్చలియ్యాలా హరిదాసుకు?"

బంగారయ్య యిక మాట్లాడలేదు. ఆరాత్రికి హరిదాసుకు భోజనం బెట్టటానికి వప్పుదల అయినాడు. మొగుడు జూడకుండా ఆదెమ్మ కోయదొరలకు రూపాయి చందా యిచ్చింది. బంగారయ్య యింటిముందే హరికథ.

పాతాని హరిదాసు అసలు కథకన్నా పిట్టకథలే ఎక్కువ జెప్పాడు. అందులో పేరాశకుబోయి పేలపిండి పిడత పగలగొట్టుకొన్న బ్రాహ్మడికథ, ఊరికే కొబ్బరికాయ సంపాదించాలని చెట్టెక్కి నదిలో బడ్డ పీనాశి షావుకారుకథ ఒకటి ఉన్నాయి. అసలుకథ "కలియుగాంతం." హరిదాసు బాగానే కీర్తనలుపాడేడు. చెవుల్లో పూలుబెట్టుకొని, బంగారయ్య అడవిమానుతో కొత్తగా జేయించిన పెద్దబల్ల విరిగేటట్లుగా నృత్యం జేశాడు. మాటిమాటికీ, వీరభోగవసంతరాయలనే కలియుగ పురుషుడు, ఫలానిచోట వుద్భవించి పెరుగుతున్నాడనీ, తెల్లగుఱ్ఱంయెక్కి, పదును ఖడ్గం ధరించి కలియుగ నాశనానికి బయలుదేరుతున్నాడనీ, పుణ్యంజేసుకొన్న పది కుటుంబాల్ని మినహాయించి యీ లోకాన్నంతా నేలమట్టంజేసి, అగ్నిప్రళయం, జలప్రళయం మొదలైన ప్రళయాలను సృష్టిస్తాడనీ, బంగారయ్య వంకకే తిరిగి రాగాలుతీస్తూ చెప్పాడు.

"అయ్యా, చూడండి, మహాజనులారా! ప్రపంచంలో ధర్మదేవత నాలుగుకాళ్ళమీద సంచారం చెయ్యటంలేదని చెప్పటానికి ఒక్కటే నిదర్శనం చాలును. ఈ పాలెంలో ఈరాత్రికి నాఒక్క పొట్టకోసం, యీ బీద హరిదాసుడు జానెడు పొట్టకోసం గడప గడపా తిరగాల్సివచ్చిందంటే, అన్నపూర్ణ అయిన మన భారతావనిలో."

హరిదాసు కళ్లుచూడలేక బంగారయ్య ఆదెమ్మ వంకగా తిరిగాడు. ఆదెమ్మ నేత్రాలనిండా నీళ్ళు నిలిచి వున్నాయి. వీరభోగ వసంతరాయలవారు నిలపబోయే పదియిళ్ళల్లో తనదిగూడా ఒకటని ఆ దెమ్మ ఆత్మతృప్తితో ఆనంద బాష్పాలు రాల్చినది.

* * *

బంగారయ్యకు ఒడలు జలదరించింది. చుట్టకాడ పారేసి యింటికి బయలుదేరబోతున్న మల్లుదొరను ఆపి—"మల్లుదొరా, యివ్వాళ ఎట్టాగోవుంది

నావంటో. ఇద్దరు కోయల్ని బంపితివా, బయట బదుకుంటారు వాకిట్లో" అని అడిగినాడు.

మల్లుదొరకి దేమీ అర్థం కాలేదు. "ఏంది శెట్టి దొరా! పెద్దరంగులమెకాన్ని మొన్న నేంగా మట్ట బెట్టింది. మెకంవాసనేస్తే కోయదొర్లకు కునుకుంటదా కంటిమీద?"

"కాదులే మల్లుదొరా. మా పెద్దోడు వట్టి పప్పు చుద్ద. చుద్ద పేరయ్యాం లే నమ్మ. ఆడు కళ్ళుమూస్తే మల్లీ దెరిచేదానికి బెమ్మంతాయన దిగి రావాలి."

కోయదొర యిద్దరు మనుషుల్ని పంపినాడు. వాళ్ళతోపాటు బాల హరిదాసుగూడా అక్కడే పడుకొన్నాడు. బంగారయ్య తెల్లవారుఝాము దాకా హరిదాసుతో మాట్లాడుతూనే గడిపాడు.

హరిదాసు వెళ్ళిన క్షణంనుంచీ బంగారయ్య దిగులు యినుమడించింది. గల్లాపెట్టెదగ్గర మతిమరుపుగా ఎక్కువ చిల్లర యిచ్చాడు. త్రాసులో సవాశేరు రాయికి వీశెరాయి, వీశెరాయికి అర్ధశేరు నవటాకురాయి వేశాడు. మల్లుదొర మనుమరాలికి అణాకు అయిదు కానులు యిచ్చాడు. కంచంముందర కూచోని దిగులు కళ్ళతో, లోతు పొట్టతో లేచిపోయాడు. పెద్దాడు యెంకట్రత్తాన్ని జూసినప్పుడల్లా కళ్లనీళ్లు దిరిగినవి అతనికి.

ఆదెమ్మకు యీ వెన్నెముకలేని మానవుణ్ణి చూడగానే కోపం వచ్చింది. "అయ్యో, యిద్దూరమా, యిద్దూరమా! ఏం మడిశెంట మాయదారి మడిశి. పెపంచకమంతా గొడ్డుబోయి ఆయనికి మనిల్లే దొరుకుద్దంటా? అయితే తెలీ కడుగుతాను, ఆ హరిదాసుమాత్రం ఏం జెప్పాడు. అన్యాయం జేసినాళ్లకు పెళయంలో సిచ్చన్నాడు గాని మనకేం దంట— మేకలంటి మడుసులం, అన్నెం పున్నెం యెరగ నోళ్లం. లెగు. లెగు: మా బాగావుందిలే నీ యిద్దె"

మూడు రోజులకుగాని ఆయిల్లు తిరిగి నిండు కంచాలు కడగలేదు. పెద్దాడు యెంకట్రత్నం జబ్బుబడ్డప్పుడు ముడుపు కడతానన్న అర్ధరూపాయ బంగారయ్య గబగబా పసుపుగుడ్డలో మూట గట్టినాడు. తిరపతి వెంకటేశ్వరస్వామికి ఖమ్మంమెట్టు వ్యాపారమప్పుడు మొక్కుకొన్న నిలువుదోపిడి మురుగులు (మూడుసవర్ల వెరశి బంగారం) తీసి రంగుకాయితంలో చుట్టి గల్లాపెట్టెపై అరలో దాచింది ఆదెమ్మ. అడపాదడపా కొడతామని మొక్కుకొన్న అరడజను కొబ్బరికాయలు ఆంజనేయస్వాములవారి పేరున పగలగొట్టాడు బంగారయ్య. పెద్దాడు ప్రసాదాన్ని కోయదొరలకు పంచిబెట్టాడు. (మిగిలిన కొబ్బరి చెక్కలు తురిమి ఆదెమ్మ శంకరపాళీ జేసింది.) ఇక కాగా పోగా పెద్దబాకీ—చింతపండు వ్యాపారంలో కలిసొస్తే చేసుకొంటామని పైకి అన్నమాట, సత్తెన్నారాయణవ్రతం ఒక్కటి మిగిలి వున్నది.

బంగారయ్య పెళ్ళాన్ని తొందర పెట్టాడు. ఆదెమ్మ అన్నది. "రేపు పౌర్ణమికి బ్యామ్మణ్ణి పిలిపించు." మల్లుదొర పోలవరంపోయి బ్రాహ్మడికి చెప్పి వచ్చాడు. పెద్దాడు యెంకట్రత్నం చింతపండు ఎగుమతుల పాతబాకీల బాపతు వసూళ్లకు రాజమండ్రి ఎట్లాగూ పోతున్నాడు గనక, పనిలో పని బ్రాహ్మడికి చదివించే పంచలచాపు, ఆదెమ్మకు చదివింపుల కింద గొల్లప్రోలు నేతచీర, బంగారయ్యకు వాడకానికి గూడా పనికొచ్చేట్లుగా నల్లకమ్మీ ధోవతులు తీసుకురావాలని నిర్ణయం జరిగింది. పెద్దాడికి బోటుఖర్చు కింద బంగారయ్య రూపాయిన్నరిచ్చాడు. "ఆరి పెద్దాడా. చెప్పినప్పుడే చక్కంగా యిను. అదలే మతిమరుపు కొడుకువి. బోటుకింద ఆరణాలు. పూటకూలు తొమ్మిదణాలు. పోతే సత్రానికి పావలా. ఇంకెంతుంటది?" అన్నాడు.

పెద్దోడు యెంకట్రత్నం తాతకింద లెక్కల్లో తయారైనాడు.

"యింకెంతేంటే అయిదణాలు గాదంటే"

"అవున్నా పెద్దాడా. ఎటు బోయి ఎటొచ్చుద్దో. కాలం నమ్మరాందయింది దాని తస్సాదియ్యా. ఆ అయిదణాలు జేబులో దాసుకో. సుట్టలు తాగొద్దని కచ్చితంగా జెబుతున్నా. బాకీలు చుస్తాగా వసూలు జెయ్యి. ఇదుగో, పంచెలూ, సీరెనూలు యెంకట్రామయ్య కొట్లోనే బేరంజెయ్యి. ఆఁ. షాకలో అన్నాడని జెప్పు మా అయ్య. బాకీలు వదిలిపెట్టేవుగనక ఆటకాయితనానికిబోయి. పేర్లారిది పెద్ద పద్దు. జాగర్త. ఆరి...నీ పిల్లాడు దొంగలు దోలా. మా లావుచిక్కే వచ్చిందే నీతో. పెద్దోడా...నీ కెన్ని సార్లు మొత్తుకోమంటావురా పైసలు బొడ్లో గట్టుకోమని.

పెద్దోడు యెంకట్రత్నం బొడ్లో రహస్యంగా దాచుకొన్న చుట్టలచోటు తప్పించి, పక్కగా దోపుకొన్నాడు రూపాయిన్నర రొక్కం.

## 3

మంగళవారానికి తిరిగి రావాల్సిన వెంకట్రత్నం బుధవారం వుదయానికి గూడా పత్తాలేదు. ఆపొద్దుటి లంఖణాల బోటులో రేవులో దిగి మల్లుదొరతో పాటు సుబ్బావధాన్లుగారు వచ్చారు. అప్పటికప్పుడే పూజంతా పూర్తయింది అయిదు అధ్యాయాలు తప్పకుండా. ఇక సుబ్బావధాన్లుగారు కథను గూడా ప్రారంభించారు. వ్రతంకథ అయిపోగానే కట్నాలు. మల్లుదొర అడవి మొగలో డొంకదారిదాకా ఎదురు బోయినాడు పెద్దోడు యెంకట్రత్నం దారి చూస్తూ.

రెండుఝాములు దాటింతర్వాతగాని వెంకట్రత్నం వూడిపడలేదు. ఊడిపడటం వూరికే వూడిపడలేదు. బంగారయ్య జాబితాయిచ్చిన కొత్త గుడ్డల్తోపాటు ఒక పెద్ద అట్టల పెట్టెగూడా మోసుకు వచ్చాడు. అట్టల పెద్దపెట్టెలో ఏమి దెచ్చిందీ—బ్రాహ్మడు వెళ్ళి, ప్రసాదం పంచటం అయిన తర్వాత గాని—పెద్దాడు యెంకట్రత్నం బయట బెట్టలేదు. యెంకట్రత్నానికి చిన్నప్పట్నించీ నాయనంటే అంతభయం. అసలు పెద్దాడు సుబ్బారాయుడి షష్ఠి నాడు పుట్టాడు. పెద్దాడంటే దేవుడి సమానం ఆదెమ్మకు. అందుకని ఆదెమ్మకు అట్టల పెద్దపెట్టె దెరిచి చూపించినాడు వెంకటరత్నం.

ఆదెమ్మ ఒక్క క్షణం తనకళ్ళు తాను నమ్మలేదు. అట్టల పెద్దపెట్టెలో రేడియో వుంది, మిసమిస మెరిసిపోతున్న కొత్తరేడియో. ఆదెమ్మకు మొదట్లో అర్థం కాలేదు. కాని తర్వాత గుర్తుకు తెచ్చుకొన్నది. ఖమ్మం మెట్టులోను విజయవాడలోను వీధుల నడిచే పౌరులకు శాంతిలేకుండా, లౌడ్‌స్పీకర్లతో హోటళ్ల నుండి మోగే రేడియో యిదేనని గ్రహించింది. తన కొడుకు యింత ప్రయోజకుడని ఆదెమ్మ యిదివరకు తెలుసుకోలేదు. పెద్దోడు యెంకట్రత్నం అమ్మ పెద్దవి రెండూ తప్పినవని పళ్ళికిలించాడు. అసలే యెంకట్రత్నం పైపళ్ళు కొద్దిగా ఎత్తు.

ఆ రాత్రిదాకా బంగారయ్యకు యీ సంగతి తెలియనే తెలియదు. చివరకు వంటగదిలోకి వచ్చి చూశాడు.

"అరే పెద్దాడా—వచ్చి నేళనుంచి వంటింట్లో అమ్మతో గుసగుసలాడతావుగాని తెచ్చిన పద్దులెక్క జెప్పమంటే అంత తప్పించుకు తిరిగావేరా. పోతే నీకాడ అయిదణాలుండాలి. ఆడ్నించి జెప్పకురా... అరి నీయిల్లు—నీ తస్స...యిదేందిరా...లేడియో... అరి"

బంగారయ్య గుండెలు బాదుకున్నాడు.

"ఇక నెత్తిన చెంగేసుకొని అచ్చయం పాత్ర బట్టి పోదాం పదరా పెద్దోడా, దేశంమీద. మనం గూడా ఆ బైరాగాళ్ళలో గలవాల్సిందేలే. ఇంకేం వుందిలే మల్లుదొరా—కొంప గుండమైపోతే."

ఆదెమ్మ కొడుకును వెనకేసుకొచ్చింది.

"ఆడుమాత్రం యేం తెలివితక్కువ జేశాడంట. పుల్చులో గలిచే అప్పుకింద కట్టుకొచ్చాడు. అంత మడిశివి నువ్వే బోయి వసూలు జేసుకోలేకపోయినా. అయ్యో—పీడా బోయిన పురుసుడే—ఒక్కగానొక్క బిడ్డ. ఆణ్ణి రంపాన రాస్తానంటావ్. అహా!"

* * * *

ఏవేళ నొచ్చిందో యేమో రేడియో అచ్చిరాలేదు—బంగారయ్య వ్యాపారానికి. సాయంత్రానికల్లా కోయదొరలంతా ఆకలి మరిచిపోయి, యెంకట్రత్నం తీగ వేళ్ళాడదీసిన చెట్టుకింద జేరుతారు. వెంకటరత్నం తిప్పలుబడి ముల్లుదిప్పి విజయవాడ కేంద్రం తెచ్చేసరికి గ్రామస్థుల కార్యక్రమమో, సినిమా పాటలో మోత మోగుతూ వచ్చేవి. కోయదొరలు చప్పట్టుగొట్టి గమ్మున కూచుంటారు. ఇక రాత్రి పదయితేనే కదిలేది.

బంగారయ్య "వ్యాపారం పడిపోయింది." అని అందరితో చెప్పుకొన్నాడు. ఆ మాటగూడా నిజం. వెంకట్రత్నం గుల్ల చింతకాయలు కొట్టించటం మరిచి రేడియోమీద పడ్డాడు. నెల దిరక్కముందే "బ్యాట్రీ" అంటూ మళ్ళీ రాజమండ్రి పోయొచ్చాడు.

కాని పీడ అంతటితో ఆగలేదు. మన్యం తాసీల్దారు వూళ్లో క్యాంపువేసి బంగారయ్య యింటి ముందు ఆకాశం తీగెలు చూశాడు.

"ఏం బంగారయ్యా, మంచి జోరులో వుందే నీ వ్యాపారం. ఎంతకొన్నా వేమిటి రేడియో?" అని యింటిముందు నిలిచి అడిగాడు.

"సిత్తం. మా పెద్దాడు యెంకట్రత్నాందండీ. సిత్తం. యాపారం పడిపోయిందండి."

"ఓహో! నీ కొడుకు మంచి ఘటికుడన్నమాట. అయితే కొంచం లైసెన్సు కాగితం యిట్లా చూపించు."

బంగారయ్య తెల్ల మొగం వేశాడు.

"జైలుకే. మధ్యలో మళ్ళీ మజిలీ వుండదు" అని తాసీల్దారన్నాడు.

బంగారయ్య పీకకు వచ్చింది. లైసెన్సు సంగతి యెంకట్రత్నం (పెద్దాడు) చెప్పలేదు. చివరకు కాళ్లు గడ్డాలు పట్టుకోంగా, తాసీల్దారు పెద్దపోష్టు మాష్టరున్న పోలవరం బోయి, అక్కడ గాకుంటే రాజమండ్రి పోయి లైసెన్సు తెచ్చుకో మన్నాడు రేడియోకోసం. ఈమాటు పెద్దాడు యెంకట్రత్నంతో పాటు బంగారయ్య గూడా ప్రయాణమై వెళ్లాడు.

## 4

ఆకాశం కోపగించినట్లు వారం రోజులనుండీ కురుస్తున్న కుంభపోత వానలకు తెరిపిలేదు. కొత్త చీరె కట్టుకుని అడవంతా పచ్చ సోయగంతో లజ్జతో తల వంచుకొని వుంది. కోయపాలెంనుంచి గోదావరి రేవుదాకా పరచుకొన్న మన్యపు డొంక బంగారయ్య మెదడువలె చిత్తడి చిత్తడి అయినది. దేవర చెట్లమీదుగా దూరాన్నుండి పాపికొండలు తెల్లమబ్బుల్లో నీలినీలిగా నిక్కినిక్కి చూస్తున్నవి.

వానల్లోనే ఆడెమ్మకు చలి జ్వరం వచ్చింది. బంగారయ్యకు భయం వేసింది. హరిదాసు చెప్పిన వీరభోగ వసంతరాయులవారి ఆగమన చిహ్నప్రళయ మేమో యిది? మల్లుదొరను పిలిపించాడు. మల్లుదొర వచ్చి ఆకు పసరుతో ఆడెమ్మకు మందు యిచ్చాడు. బంగారయ్య పాత ముడుపులన్నీ పోగుజేసి ఆడెమ్మ తలగడకింద బెట్టాడు. ఆడెమ్మకుగూడా భయసందేహాలు వేసినవి. తనమెళ్ళో బైరాగి యిచ్చిన రాగి తాయెత్తుతీసి బంగారయ్య జబ్బకు కట్టింది. గల్లా పెట్టెలో మూలదాగివున్న జపవీభూదినిగురించి అతనికి జ్ఞప్తి చేసింది.

బంగారయ్య తాయెత్తు కట్టుకొన్న మధ్యాహ్నమే వాన కొంచెం తెరిపి యిచ్చింది. అప్పటిదాకా రేడియోముల్లు దిప్పి "గర్ గర్ గుర్ గుర్" వింటున్న పెద్దాడు యెంకట్రత్నానికి బెజవాడ మళ్ళీ అందింది. అందటమే, పెద్దాడు ప్రాణంబోయినట్లుగా అరిచాడు.

"అయ్యా, ఓఅయ్యా! రాజమండ్రంతా కొట్టుకపోయిందట"

కొడుకు మాటలకు బంగారయ్య కొయ్యబారిపోయాడు.

"ఆరి యెర్రిపేరయ్యా, మల్లీ బోయి యిన్రా. సింగారంగారిల్లు గూడా కొట్టుకపోయిందో వుందో."

పెద్దాడు గబగబా రేడియోదగ్గర కెళ్ళాడు. గల్లాపెట్టెలో లెక్కబెడ్తున్న చిల్లరంతా మూసి బంగారయ్యగూడా వణుకుతూ కొడుకు వెనకనే నిలబడ్డాడు—పరుగునబోయి.

వార్తలు మరొక క్షణంలో ముగిసినవి. గోదావరి వరదలు యింకా వుధృతంగానే వస్తున్నవి. గండ్లు పడుతునే వున్నవి.

బంగారయ్యకు మతి చలించి పెద్దాడిమీద వెర్రికోపం వచ్చింది.

"ఆరి నష్టకాలం దరిద్దురుడా—యిప్పుడు సింగారం కొంపగూడా బోతే ఏంగావాలిరా మన అప్పు? నామాట గమనం లేకపోయె తాడు దెగినాడికి. —అప్పుడేయెల్లి గుమ్మంకాడ గూచొని యిస్తావా సస్తావా సింగారయ్యా? యియ్యకపాతే యింతటితోనే సెల్లు నాపాణం అని పీకమీద కూసుంటె యాడికి బరిగెత్తేవాడ్రా? ఇప్పుడు నీతాత ఎవడు గడతాడ్రా?"

పెద్దాడు నిజానికి తెలివిగల ఘటమే. ప్రాణం మీదికి వచ్చేట్టుగావుంది యీ పరిస్థితి. వెంటనే నిజం చెబితేనేగాని పరువు దక్కదు.

"ఇళ్లు గొట్టుకుపోయినై యని ఎవడే అంది. గోదావరమ్మ పొంగి పట్నంలోకి వరద లొచ్చినయ్యంటనే. అంతేలే."

* * * *

ఒక్క క్షణంలో కోయపాలెమంతా బంగారయ్య కొట్టుముందే నిలిచివున్నది. పోలుమల్లును దేవర చెట్టెక్కించి డొంకమీదుగా చూడమని మల్లుదొర ఆదేశిస్తున్నాడు.

వరద వచ్చింది. వరద వచ్చింది. గోదావరమ్మ పరవళ్లు తొక్కి పొంగింది.

ఆ సాయంత్రానికి దిగువలో వరదలకు మునిగిన కోయగూడాల్లోని నిర్భాగ్యులందరూ పాలెం చేరటం ప్రారంభించారు. నెత్తిమీద గంపల్లో యిల్లంతా సర్దుకొని మగవాళ్లు, పిల్లల్ని వీపులకు గట్టుకొని ఆడవాళ్లూ, బురదలో కావిళ్లు మోస్తూ కోయ యువకులూ, అడవిలో కొత్త లోకం యీనినట్లుగా, వారం రోజుల వానలకు ప్రతి పచ్చ చెట్టు మానవు

లైనట్లుగా వూరంతా కొత్త కాందిశీకులతో నిండిపోయింది. ఆ రాత్రి అందరి ప్రాణాలూ అరచేతుల్లోనే స్తంభించి కూర్చున్నవి.

మల్లుదొర జట్లు జట్లుగా కోయదొరల్ని కూర్చాడు అప్పటి కప్పుడు. అడవి తడిదెబ్బ చితుకుల్తోనే దివిటీలు కాగడాలూ కట్టించాడు. గోదావరమ్మ దిక్కుగా జట్లను కాపలాబెట్టాడు. దివిటీలు ఆరిపోయాయా, కోయపాలెంగూడా గోదావరి బలిగోరినట్టే. దివిటీలు వెలిగినంతసేపూ గుండెల్లో ఆశలూ వెలుగుతాయి. ఆ రాత్రి అడవిలో చీమచిటుక్కనలేదు. మనుషులు ఉచ్ఛ్వాసనిశ్వాసాలు మరిచిపోయి దివిటీలమీద దృష్టినిల్పి ఆ రాత్రంతా జాగరం చేశారు. ఆడంగులు వీపుకు కట్టిన పిల్లల్ని తీయకనే కునికిపాట్లు పడ్డారు.

ఉదయానికి దివిటీలవాళ్ళు తిరిగి వచ్చారు. వరదలు తీస్తున్నవి. నీళ్లు నిలిచివున్నా, వుప్పెనగా ముందుకు సాగడంలేదు. కోయదొరలు చిరకాలాల నుండి సంతోషం పొంగినపుడు, మానవుడిని ప్రకృతి రక్షించినపుడు క్షణంలో, అప్రయత్నంగా పొంగి పరవళ్ళుద్రొక్కే ఆదినృత్యం చేశారు. బాలహరిదాసు మాట బూటకమయిందని బంగారయ్య సంతోషించాడు. వానలు సాగకముందే బంగారయ్యా సరుకుల పడవ వచ్చింది. అందువల్లదుకాణం సంక్రాంతి నాటిధాన్యపుపురిగా వుంది.

బంగారయ్యకు తిండి తింటానికిగూడా తీరిక చిక్కటం లేదు. ఊరిమీద పదివూళ్ళవాళ్ళు వచ్చిపడ్డారు. కోయలు కడుపు నింపుకొంటున్నది వెదురుబియ్యం గంజయినా ఉప్పక్కర్లేం దెవరికి? కోయయినా, కలెక్టరయినా వుప్పులేనిదే పూట గడవదు.

బంగారయ్య పెద్దాణ్ణి బిలిచి కేక వేశాడు.

“లేడియో లేడియో అని లేడివైపోతా వేరా నాపసన్నాసీ. ఎప్పటికైనా తిండిబెట్టేది తరాజే ననుకో యెర్రినాగమ్మా. బేరం నేర్చుగోరా అంటే బింకం పోతావ్? అదనుబట్టి పదును బేరంరా పప్పు చుద్దకానా...అంతాడి కాపేసి, లోనికెళ్ళి వుప్పు బస్తా లెన్నా లెక్కట్టొచ్చి జెప్పు.”

యెంకట్రత్తం లోపల్నించే కేకేసినాడు.

“నాలుగేనే అయ్యా.”

“అరి నీగొంతుగొయ్యా. అరి నీపీక యములాడు నొక్కా. ఏం పోగాలం వచ్చిందిరా పెద్దాడా! బేరమనుకొన్నావా, అల్లాటప్పా అనుకొన్నావా పెద్దాడా?”

మరొక్క క్షణంలో కోయపాలెంలో ఉప్పు ధర హఠాత్తుగా లేచింది.

## 5

రేడియో వచ్చింతర్వాత బంగారయ్యకు ఒక ఆత్మతృప్తి వచ్చింది. సాయంత్రం సాయంత్రం దేశంలో పప్పుకు, నూనెకూ, మిర్చికి, పసుపుకూ తాజామార్కెటు ధరలు తెలుస్తూంటవి. బంగారయ్య తన ధరలన్నీ మనసులో గుణించుకొని పెద్ద మార్కెటు ధరలతో పోల్చుకుంటాడు. ఇదివరలో వ్యాపారం జేసేవాళ్లు యింత తెలివితక్కువ వాళ్ళని అతనికి గట్టి నమ్మకం కలగలేదు. ధరలు హెచ్చటం చేతుల్లో బెట్టుకొని యింకా చచ్చు ధరలకు కట్టుబడి, పైపెచ్చు రేడియోల్లోగూడా చెప్పుకొనేవాళ్లు తెలివిలేనివాళ్లు గాక మరేమిటి?

ఏమయితే నేం కానీకి, అర్ధణాకు వుప్పుదర్శనం దుర్లభమైంది. అణాకు చారెడిచ్చినా యిచ్చినట్టే— కోయపాలెంలో. ఇక పప్పు కొత్త పెళ్లికూతురై కూచున్నది. మిర్చి దేవుడి వరమైంది. అడివిలో దొరికే గుల్లచింత తప్పితే మిగతా దినుసులన్నీ మింటికెక్కిపోయినవి.

మల్లుదొరగ్గూడా చివరకు వుప్పు దొరకలేదు.

“ఏం శెట్టిదొరా, ఉప్పు బొత్తిగా అన్యాయమయిపోయింది” అని అడిగాడు.

“నువ్వు జూస్తానేవుంటివిగదా మల్లుదొరా. పడవలో ఏసుకొచ్చిందే అరబస్తా. దానిమీద వరదలొస్తై యని ఆ చచ్చినాళ్ళకు దెలుసో యేమో, బంగారం దూచినట్టు గొలిచి బుడ్డోణ్ణి అన్యాయం జేసినారు రాజమండ్రిలో. ఎందుకైనా మంచిదని మా పెద్దోడు యింటివాడకానికి నాలుగుచిప్పలు తెల్లుప్పు దెచ్చినాడే. కావాలంటే నీకు గాదంటామా మల్లుదొరా, పొద్దునాలలేస్తే మొగాలు మొగాలు జూసుకుంటం? పిల్లొచ్చి అడిగినాక మల్లీ బేడ్డబ్బులికి కూస్తంతే వచ్చిందని అంటార్లే అని వుప్పులేదమ్మా అని తాతకు జెప్పమన్నా. అంతేలే. గావాలంటే బేడుప్పుపొట్లాం గట్టెయ్యరా పెద్దోడా” అని బంగారయ్య గల్లాపెట్టె ముందునుంచి లేచి లోపలికిపోయి, పెద్దాడు యెంకట్రత్తం వేళ్ళమీద ఒక్కదెబ్బేసి ఉప్పురాల్పించి,

చిన్న పొట్లాం బయటికి బంపి వేళ్ళతో పైసలసంజ్ఞ చేశాడు.

మల్లుదొరన్నాడు. “రాసుగో శెట్టిదొరా. పాత పొద్దుకింద రాయించు.”

“అట్టాగలే. నీగావంటానా. సిల్లర లేదని మా పెద్దోడు పైసలడిగిండులే”

సాయంత్రం గాకముందే బంగారయ్య ముందు కొట్టుకట్టేశాడు. బేరం జోరుగా సాగటంజూసి ఆరోజు నుంచి ఆదెమ్మగూడా లేచి తిరిగి బంగారయ్య చెయ్యికింద నిలిచింది. ఆదెమ్మ ఖాళీ చేసిన మంచంలో బంగారయ్య పడుకొని “చలిజ్వొరం అని చెప్పరా పెద్దోడా—” అన్నాడు. ఆదెమ్మ, పెద్దాడు యెంకట్రత్తం వెనకనుండి బంగారయ్య చెప్పిన ధరలు పలికితేనే వుప్పమ్ముతున్నారు. పాతధరలకు ఉప్పులేదు. అసలు లేదు, నల్లవుప్పుగాని తెల్లవుప్పుగాని. బంగారయ్య ముసుగుదన్ని యింకా నెలదాకా పడవలు నడవకపోతే బాగుంటుందని కళ్ళు మూసుకొన్నాడు.

* * * *

బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయిన కోయపాలెం ముసుగులో నిద్రిస్తున్న మానవుడివలె గోచరించింది. ముసుగులో మనిషికి ఏ స్వప్న సందర్శన మవుతున్నదో ఎవరికీ తెలియదు. అన్ని దృక్కోణాలకు చైతన్య రహితంగా కన్పిస్తున్న కోయపాలెం గూడా ఏ అంతర్వాహినులవల్ల కదిలింపబడుతున్నదో బాహ్యదృష్టితో తెలుసుకొనటం అసంభవం. స్వప్నదశలోని మానవుడిని స్వప్నదశ హఠాత్తుగా మేల్కొలిపినట్లే తరతరాలనుండి చేతి మూలలో, అంగుళం అంగుళములోనూ పొంచియూచే మృత్యువుతో పోరాటం సల్పుతూ శాంతియుతంగా జీవయాత్ర గడుపుతూన్న కోయపాలాన్ని గూడా ప్రస్తుత నిస్సహాయ వాతావరణంనుండి రెండు జ్ఞాన చక్షువులు మేలుకొలుపు పాటను వినమని నిర్దేశించినాయ్. ఈ జ్ఞానచక్షువులు గోదావరి పాలబడకుండా నిర్వాసులుగా వచ్చిన యిద్దరు యువకులు బాలదొర, గంగుదొర.

బాలదొర, గంగుదొర అన్నదమ్ములు. ఆటవిక జాతుల్లో యుగయుగాలుగా వెలకొన్న వీరోచిత సాంప్రదాయాలకు వాళ్ళ కుటుంబం పెట్టింది పేరు. ప్రతితరంలోనూ స్వాతంత్ర్యరక్షణార్థం కత్తిచేపట్టి బాణం సంధించిన కుటుంబరక్తం వాళ్ళనాళాల్లో ప్రవహిస్తూవుంది. మహావీరుడు అల్లూరి సీతారామరాజు మన్యం పితూరీలో బ్రిటిష్ సామ్రాజ్యవాద సేనలను ముప్పుబెట్టిన కోయసైన్యంలో వాళ్ళ తాత వీరోచిత మరణం పొందాడు. ఆతరవాత కుటుంబం భద్రాచలం దాటి నైజాంలోకి వలసబోయింది. బాలదొర, గంగుదొర పసివాళ్ళుగా పట్టీలుకొడుతున్నప్పుడు తల్లిని అవమానించబోయిన ముస్లింజాగీర్దార్ గుండాలతో పోట్లాడుతూ తండ్రిగూడా దుర్మరణం పాలయినాడు, అయితే నలుగురు తురక రౌడీలను మట్టుబెట్టి గాని అతనుభూమికొరగలేదు. ఆతరవాతతను వంతే వచ్చింది. ఏ స్వాతంత్ర్యసంగ్రామమూ తనకు తానై అది శిలాశాశ్వతమై, సంపూర్ణమై పరిపూర్ణతపొంది చరిత్రపుటలలో మాత్రమే నిద్రించలేదు. తండ్రులు జయించినామనుకొన్న స్వాతంత్ర్యం బిడ్డలు తిరిగి రక్తమోడ్చి నిలబెట్టుకోవాలి. బిడ్డలపోరాటాన్ని తరువాతి తరంవాళ్ళు కొనసాగించకపోతే, బానిసత్వం, తాడన, పీడన కొత్తరూపంలో కొత్తనిరంకుశుల ద్వారా, కొత్త యుద్ధోన్మాదులద్వారా, కొత్త మత దురహంకారులద్వారా వచ్చి వాకిలిముందు నిలుస్తాయి. స్వేచ్ఛావృక్షానికి తరతరములోనూ నిరంకుశులదో, యుద్ధరాక్షసులదో రక్తం ఎరువుగా కావాలి. మొగ్గదొడిగి, పూలుబూసి, పిందెవేసి, కాయకాచి, పండునిచ్చే ఆ వృక్షానికదే నీరు.

బాలదొర, గంగుదొర తండ్రి తరవాత పిలుపందుకొన్నారు — మాతృదేశపు ఆర్తనాదంతో. నైజాంలో యిత్తేహాద్ ముస్లిమీన్ నరహంతకులు, రజాకారు పచ్చిరక్తంతాగే గుండాలు కోయగూడేల మీదపడి, తెలుగుకోయ వనితలను చెరిచి, పురుషుల్ని చంపి, హిందువన్నవాడి ఆస్తినంత దోచుకొని లోకానికి పీడ బెట్టినప్పుడు ఈ చదువురాని అడవి కోయలు తిరిగి బాణాలు లంకించుకొన్నారు. అడవిలో మెకాల్ని చంపేబదులు వాళ్ళ ఈటెలు, బాణాలు నిరంకుశ మత దురహంకారులను వెతికి చంపినవి. ఆ బాలదొర గంగుదొర తిరిగి వరదలో ప్రాణాలు దక్కించుకొని ఆశ్చర్యకరంగా చుట్టూ నీళ్ళలో లంకగా తేలుతున్న కోయపాలెం చేరుకున్నారు.

బంగారయ్య కొట్టుముందు జనంమూగి తిరిగి పోతున్నారు. ఆ జనంలో మొదటిరోజునే బాలదొరకు వుప్పుదొరకలేదు. తరవాత గంగుదొర వెనకగా వెళ్ళితే ఆదెమ్మ బేడకు చారెడు వుప్పు పొట్లాం

గట్టి యిచ్చింది. గంగు బయట వుప్పుకోసం వేచి వున్నప్పుడు, పెద్దాడు యెంకట్రత్తం, బంగారయ్యా రేడియోలో మార్కెట్ ధరలు వింటున్నారు. ఉప్పు దీసుకొని యీవలకు వచ్చి గంగు బాలదొరకు చెట్టు మీదినుంచి బంగారయ్య యింటిమీదదాకా వేళ్లాడు తున్న తీగెల్ని చూపించాడు. ఆ తరవాత చేతిలో వుప్పును పైకెత్తి చూపాడు.

ఆ యిద్దరూ అక్కడే నుంచున్నారు. వచ్చిన కోయల కందరకూ పైన తీగెలూ, చేతిలో వుప్పు చూపించసాగారు. చీకటిబడ్డదాకా అదే పని. మల్లు దొరవచ్చి "ఏందిరా, భద్రాచెలం బాలూ?" అని వాళ్ళముందు నిలిచాడు. బాలు పైన తీగెలు చూపాడు. గంగుదొర చేతిలో వుప్పుపొట్లం చూపినాడు. మల్లు దొర కళ్ళు ఒక్కసారి మెఱిసినవి.

* * * *

అర్ధరాత్రి యింట్లో చప్పుడుకు బంగారయ్యకు మెళకువ వచ్చింది. దీపం పెద్దదిచేసి లేచి చూచాడు. పెద్దాడు, యెంకట్రత్తం నిద్రబోతున్నాడు. ఆదెమ్మ చిన్నగురకలో మార్పేమీ లేదు. బంగారయ్య దీపాన్ని పైకెత్తి చూచాడు. ఎదురుగా నలుగురు ముసుగు మనుషులున్నారు. వాళ్లకు ముఖాలనుండి కాళ్లదాకా ముసుగే వున్నది. బంగారయ్య కాళ్ళు గజగజ వణికినవి. చెయ్యి చలిజ్వరంనాడులాగా కదలిపోయి దీపం జారవెయ్యబోయ్యాడు. ఒక ముసుగు ముందుకొచ్చి అతని చేతిలో దీపం తీసుకొన్నది. బంగారయ్యకు నోరు పెగిలిరాలేదు. ఆ ముసుగువంక చూడలేక ప్రాణభయంతో తలవంచుకొన్నాడు. పారిపోదామన్నా పాదాలు కదలవు. బంగారయ్య తలవంచు కొన్నప్పుడు రెండుటి ముసుగు పాదాలు కనబడ్డవి. ఆ పాదాలు మల్లుదొర పాదాలకువలె ముద్దగావున్నాయ్. ముసుగు కదలలేదు. లాంతరు తగ్గించి అతనిముందే పట్టుకు నించొన్నది.

మిగతా మూడు ముసుగులూ కదలినవి. ఆ కదలికలో తొందరలేదు. భయం అసలే కానరాదు. ఒక ముసుగు పెద్దాడు ఎంకటరత్తాన్ని దాటి రేడియోవున్న కావిడిపెట్టెదాకా నడిచి, రేడియో నందుకుని మళ్లీ పెద్దాడిమీదుగానే యింకో ముసుగుకు అందించి. ఆ ముసుగు మరొక ముసుగుకు. చివరకది దీపం పట్టుకొన్న ముసుగువద్ద కొచ్చింది. బంగారయ్య కూలబడి చూచాడు. తనను వాసన చూపెమన్నట్లు ముసుగు వంగి పెద్దాడి "రేడియోను" అతని ముక్కుకు దగ్గరగా తెచ్చినది. మరుక్షణంలో నాలుగు ముసుగులూ మాయమైపోయినవి— రేడియోతో సహా.

## 6

మర్నాడు మల్లుదొర వెళ్ళినప్పుడు ఆదెమ్మగల్లా పెట్టెముందు వున్నది.

"చలిజ్వొరం వచ్చిందిగా" అన్నది.

"అఁ! యేంలేదులే. శెట్టిదొర రేవులోకి పడవ లెప్పుడొస్తయ్యో రేడియోమీద అడిగి జెపతనన్నడ్లే" అని మల్లుదొర అన్నాడు. "మరి పడవలొస్తేనే గదా వుప్పుబస్తాలు"

మల్లుదొర కదలిపోతుంటే బంగారయ్య లేచి వచ్చాడు. "ఉప్పుగేంలే మల్లుదొరా! మా పెద్దోడు మూడుబస్తాలు పప్పుకింద గట్టాడు. తీచికెళ్ళు. తీచి కెళ్ళు. పాతధరేలే!"